

ఇంకో రెండు నిమిషాల్లో రైలు కదలబోతోంది. "వెళ్లగానే ఫోన్ చేయండి" "మీరున్న పదిరోజులూ పది నిమిషాల్లో అయినట్లుగా వుంది". "పావ్‌గడ్‌లో కాళీమాత దర్శనం అద్భుతంగా వుంది". రోప్‌వే మొదటిసారి చాలా థ్రిల్లింగా అనిపించింది." "బరోడా పాలెస్‌లో రవివర్మ బొమ్మలు యింకాయింకా చూడాలనిపించాయి."

ఆ ముచ్చట్ల అచ్చట్ల మధ్య గావుకేక పెట్టిం ) ఆదితాళం.

అందరూ ఆందోళనగా ఆదితాళం దగ్గరికొచ్చారు.

కేకలు పెట్టే రోగాలేవిటా అని ఆలోచనలో పడ్డాడు అక్కడే వున్న డాక్టరు జవసత్వం. నడి రోడ్డు మీద ఎవడో గుండెపగిలేట్టు అరిచి పడిపోవటం చుట్టుపక్కల వాళ్లు చేతిలో తాళం చెవిపెట్టి ఓందెలతో నొక్కిపోయడం గుర్తుకొచ్చింది. నిజమే. ఆ గుర్తు గుర్తుని చెరిపేసాదు జవసత్వం. ఒక నిమిషం తర్వాత తెలిసింది. ఆవిడ ఆర్తనాదం తాళం చెవి కోసమని. ఏదో ఓ తాళం చెవి తీసిద్దామని జేబులోకి చేయిని పంపించాడు జవసత్వం.

"చాల్లెండి మీ మానవతా స్పందన. ఆవిడ యింటి తాళం చెవులు మరచిపోయి వచ్చిందట" అని చెవిలో చెప్పింది జవసత్వం భార్య ప్రథమచికిత్స.

"ఓసింతేనా దానికింత కొంపలంటుకుపోయినట్లు ఘొల్లుమనాలా" అన్నాడు జవసత్వం.

"కొద్దిపాటి దూరంకాదు టికెట్ కాన్సిల్ చేసి యింకో రైల్లో వద్దామంటే" అంది ప్రథమచికిత్స.

"అయితే మాత్రం దానికంత గొంతెత్తాలా" మళ్లీ అడిగాడు జవసత్వం.

"మీకేం తెలుసు దాంట్లో ఒక మతలబు వుంది" అంది ప్రథమచికిత్స.

"క్షణంలో అది కూడా లాగావా" అన్నాడు జవసత్వం.

"వాళ్లాయనకు పిచ్చికోపమట. ఈ సంగతి తెలిస్తే వీబ్భద్దలు చేస్తాడట" చెప్పింది ప్రథమచికిత్స.

"ఏంటి - యింత మందిలో కూడా కరలాస్య కళాప్రదర్శన చేస్తాడటా"

"తిరుపతి బ్రహ్మోత్సవాల్లో ఒకసారి, గోదావరి పుష్కరాల్లో ఒకసారి, బెజవాడ బస్టాండ్లో ఒకసారీ వీపుపగిలి మళ్లీ అతుక్కుందట. జనాన్ని మీరే ఊహించుకోండి" అంది ప్రథమచికిత్స.

"అంత తప్పులేం జరిగాయో పాపం" అన్నాడు జవసత్వం.

"మొదటిసారి - తాళం వేసి తాళాంచెవి తాళంలోనే మరచిపోయిందిట. రెండోసారి - గోదావరిలో స్నానం చేస్తుంటే కొంగుముడి వీడి తాళం చెవులు నీళ్లలో పడిపోయాయట. మూడోసారి - తాళంచెవులు పెట్టిన సంచీ బస్సులో ఎవడో దొంగ ఎత్తికెళ్లాట్ట" చెప్పింది ప్రథమ చికిత్స.

"యిప్పుడూ తాళమేనా వామ్మో" అన్నాడు జవసత్వం.

"గట్టిగా అరవకండీ. మీరేదో యింజక్షనిచ్చి ఆమె యిక్కడ పడుకుని హైద్రాబాద్‌లో లేచేట్లు చేయాలి" అంది ప్రథమచికిత్స.

"అదిసరే. దిగింతరువాతేగా తాళంచెవి కావాల్సింది. అదెట్లాని" అన్నాడు జవసత్వం.

"సెల్లులో బరోడా వాళ్లతో మాట్లాడాను. ఓవర్‌నైట్ కొరియర్ సర్వీసులో వీళ్లు హైద్రాబాద్‌లో వాళ్లింట్లో అడుగుపెట్టేలోపులో చేరే ఏర్పాటు చేసారు" అంది ప్రథమచికిత్స.

"ఆ కొరియర్‌ని తీసుకునేదెవరు" అడిగాడు జవసత్వం.

"ఆ ఫ్లాట్స్ వాచ్‌మన్ కాలభైరవం. ఆ కవర్ మీద సెల్ నెంబరు నాదే యిచ్చాను. ఆ విషయాలు నేను చూసుకుంటా. మీరు యింజక్షనివ్వండి" అంది ప్రథమచికిత్స.

*   *   *

"అయ్యా హవ్యవాహనంగారూ! మీరింత చక్కగా నవ్వుతూ మాట్లాడుతారు. మీకు పిచ్చి కోపమంటారు. ఎంతవరకు నిజమండీ?" అడిగాడు జవసత్వం.

"నేను కోపమే ఎరుగనండీ. మా ఆవిడ అజాగ్రత్త చూస్తే చాలు. మరి..." అన్నాడు హవ్యవాహనం, నిద్రమత్తులో గురక పెడుతున్న ఆదితాళాన్ని కదిలిస్తూ.

"ఏమవుతుందేంటి" అడిగాడు జవసత్వం.

"లేచింతరువాత మా ఆవిడనడగండి" అన్నాడు హవ్యవాహనం.

"అజాగ్రత్త మానవసహజం కదండీ" సౌమ్యంగా అన్నాడు జవసత్వం.

"కాదు, భార్య సహజం" చికాగ్గా అన్నాడు హవ్యవాహనం.

"భర్త సహజం ఎందుకు కాకూడదన్నయ్యగారూ" అంది ప్రథమచికిత్స.

"అది మీ యింట్లో ఏమోగాని మా యింట్లో కాదు" చికాకు మొహంతోనే అన్నాడు హవ్యవాహనం.

"మీరు పోగొట్టుకున్న ఆరు సెల్‌ఫోన్లు ఎవరి అజాగ్రత్తవల్లేంటి" అంది ప్రథమచికిత్స.

"ఎవరు చెప్పారు మీకా సంగతి" చికాకుని కొంచెం కోపంగా మార్చి అన్నాడు హవ్యవాహనం.

"మీరే అన్నారు. యిప్పుడు వాడేది ఏదో సెల్లో చెప్పుకోవడం - అదో సోషల్ స్టేటస్ అనీ, మీ చేతిలో వుంది ఏడోపీసనీ" అంది ప్రథమచికిత్స.

యింతలో టీసీ వచ్చి 'టికెట్ ప్లీజ్' అన్నాడు.

హవ్యవాహనం వళ్లంతా తడుముకుని గాభరాపడి చినిగిన జేబు చూపించాడు. "పిక్‌పాకెటింగ్ జరిగింది. నా పర్సు, టికెట్లు కూడా అందులోనే వున్నాయండీ" అంటూ.

"అంత అజాగ్రత్త అయితే ఎట్లాండీ, జేబు దొంగల హెచ్చరికతో ప్రతి చోటా ఫోటోలు కూడా పెట్టాం" అన్నాడు టీసీ.

"అన్నయ్యగారు ఆ ఫోటోలు చూస్తున్నప్పుడే ఎవరో జేబు కత్తిరించినట్లున్నారు" అంది ప్రథమచికిత్స.

"సరే. తర్వాతి సంగతర్వాత. ముందు మీరు పేమెంట్ చేసి రసీదు తీసుకోవాల్సిందే. దిగింతరువాత చూపించడానికుంటుంది" అన్నాడు టీసీ

*   *   *


"అయ్యబాబోయ్. నా పేరు మీద కొరియరేంటండోయ్. తెరిస్తే పేలుతుందో ఏంటో" అన్నాడు వాచ్‌మన్ కాలభైరవం.

"అడ్రసిదేకదా. సీసిక్స్‌టూలో హవ్యవాహనం గారేగా వుండేది" అన్నాడు కొరియర్ బాయ్.

"ఆయనే, ఊరెళ్లడం తెలుసు. ఎప్పుడొస్తాడో తెలియదు" అన్నాడు కాలభైరవం.

"అదేమోగాని మీపేరుమీదొచ్చింది కాబట్టి మీకివ్వడమే నా ధర్మం" అన్నాడు కొరియర్ బాయ్.

దీన్లో ఏముందో ఏంటో. వాళ్లు ఊరునుంచి



వచ్చిందాకా నాదగ్గర ఉంచుకోవచ్చో లేదో అనుకుంటూ ఆ కవర్ని వెంటిలేటర్లోంచి హవ్యవాహనం ఫ్లాట్లోకి విసిరేసాడు కాలభైరవం.

* * *

సికింద్రాబాద్లో రైలాగింది.

ఆదితాళం సిద్దిపేట తాళం చెవి గుర్తుకొచ్చి గాభరాపడి కొలిచిన దేవుడి బొమ్మకు దండం పెట్టుకుంది.

హవ్యవాహనాన్ని మాత్రం వెంటనే యింటికి వెళ్లకుండా రకరకాల ప్రయత్నాలు చేసి నీరుకారిపోయాడు జవసత్వం. అందరూ కలిసి ఆటోలో యింటికి వెళ్లారు. ఆదితాళం తమ్ముణ్ణి తోడుగా వుండాలని రమ్మని ఫోన్ చేసింది ప్రథమచికిత్స - కాలభైరవాన్ని జవసత్వం కలిసి మాట్లాడేలోపులో-

"సార్, నాపేరు మీద మీకో కొరియర్ వచ్చింది. మీ యింట్లోనే పడేశా" అన్నాడు కాలభైరవం. హవ్యవాహనం అదేంటన్నట్లు చూశాడు. ఖంగుతిన్నారు జవసత్వం, ప్రథమచికిత్స.

జరిగిన సంగతంతా హవ్యవాహనానికి వివరంగా చెప్పాడు జవసత్వం. - తాళాలు రిపేరు వాణ్ణి పిలవడం, డూప్లికేటు తాళాలు చేయించడం, తాత్కాలికంగా తలుపులు తెరుచుకుంటాయి గాని సేఫ్టీకోసం ఒరిజినల్ తాళాలే తీసుకోవాలి. ఖర్చు - అన్నీ కంటి ముందు మెదిలి కన్నెర్రజేసి ఆదితాళం మీద చేయి పైకిలేపాడు హవ్యవాహనం.


ఆదితాళాన్ని పక్కకు లాగింది ప్రథమచికిత్స. ఆ హడావిడిలో హవ్యవాహనం చేతిలో సెల్లు జారిపడి ముక్కలైంది.

"ఇక పీస్ నెంబరు ఎనిమిది. మీ స్టేటస్ మారిందన్నయ్యగారూ" అంది ప్రథమచికిత్స.

* * *

"మీరు ఈ పిచ్చికోపాన్ని వదిలిపెట్టకపోతే మీపై చట్టపరంగా చర్య తీసుకోవాల్సి వుంటుంది." అన్నాడు హవ్యవాహనం బావమరిది వచ్చి.

"ఒరేయ్! సొంత ఖర్చుతో నిన్ను నాందేడు తీసికెళ్లి నీతో లా పరీక్ష రాయించింది నేను.




నిన్ను లాయర్ని చేసింది నేను. ఓరేయ్! న్యాయ వ్యాధీ నాపై చర్య తీసుకుంటానంటావురా" అన్నాడు హవ్యవాహనం.

"అక్కయ్యమీద మీరెన్నిసార్లు చేయి చేసుకున్నా నేనేమన్నా అన్నానా బావగారూ. బైట టీవీవాళ్లు, పేపరువాళ్లు, పోలీసులూ కాచుక్కూచుంటే తప్పించుకొచ్చా, మీకీ విషయం చెబుదామని" అన్నాడు బావమరిది.

కోర్టుసీను ఊహించుకున్న హవ్యవాహనంలో మార్పు వచ్చింది. సమయానికి డాక్టరు జవసత్వం వచ్చాడు.

"డాక్టరుగారూ నేనే వద్దామనుకుంటున్నా మీరేవచ్చారు" అన్నాడు హవ్యవాహనం.

"దేనికో" అన్నాడు జవసత్వం.

"జవసత్వాలుడిగిపోయినా నా చేయిపైకి లేవకుండా వుండేట్లు లేదు. మీరే ఏదన్నా ఆపరేషన్ చేయాలి" అన్నాడు హవ్యవాహనం.

"పేషంటు కోరినట్టు కత్తితిప్పడం మా వృత్తి ధర్మం కాదు" అన్నాడు జవసత్వం.

"అయితే బావగారి చేతులకి సంకెళ్లు వేద్దాం వైరైటీగా" అన్నాడు బావమరిది.

"ఆ మాట నీ నోటికెలా వచ్చిందిరా" అంటూ తమ్ముడి వీపుమీద చేయి విసిరింది ఆదితాళం.

"అక్కా" – అని అరిచి లేవకుండా పడిపోయాడు బావమరిది.

"ఇక నా జన్మలో నీ మీద చేయి చేసుకోనే య్. అంతగా కోపం వస్తే యివిగో యీ యినుప బస్తా వేలాడదీస్తున్నాను దానిమీద నీ పేరు రాస్తున్నాను" అన్నాడు హవ్యవాహనం.

"మాక్కావాల్సిందదే బావగారూ. అయితే యింకో బస్తా కూడా బాల్కనీలో వేలాడదీస్తున్నాను. దానిమీద మీ పేరు రాస్తున్నాను. కాకపోతే దానిలో వుండేది దూది" అన్నాడు బావమరిది లేచి.

"ఆఁ" అన్నాడు హవ్యవాహనం.

నవ్వాడు జవసత్వం.